సాక్షి
వికారాబాద్

ఆదివారం । 6 । జూలై । 2025



చిన్నజాతర ప్రారంభం

అనంతగిరి గుట్టపై వెలసిన అనంత పద్మనాభస్వామి ఆలయంలో ఆషాఢమాసం చిన్న జాతర ఘనంగా ప్రారంభమైంది. 8లో▸



భక్తిశ్రద్ధలతో పీర్ల పండుగ

దుద్యాల్ మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. 8లో▸



అంతా డిజిటలైజేషన్!

పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో సమాజంలో ఎక్కడ చూసినా క్యాష్‌లెస్ చెల్లింపులే జరుగుతున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

యాలాల: ఈ నెల 10, 11వ తేదీల్లో జరగనున్న కేవీపీఎస్ జిల్లా స్థాయి సామాజిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య కోరారు. శనివారం మండల కేంద్రంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల్లో ఇచ్చిన అంబేడ్కర్ అభయహస్తం పథకం ఉన్నట్టా లేనట్టా అని ప్రశ్నించారు. రాజీవ్ యువ వికాసం వల్ల దళితులకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పేరుతో ప్రస్తుతం ఉన్న గురుకులాలను ఎత్తేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. శిక్షణ తరగతులకు రాష్ట్ర కార్యదర్శి సైకిలాబ్ బాబు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బస్వరాజ్,కృష్ణ, మల్లేషం, మొగులప్ప పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్‌రూరల్: సాంఘిక సంక్షేమ వికారాబాద్ మహిళా డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తోల్‌కట్ట సమీపంలోని ఎస్‌వీ కళాశాలలో కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ వికారాబాద్ మహిళా డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న డీఎల్ కంప్యూటర్ సైన్స్-1, తెలుగు-1, ఫిజిక్స్-1, జువాలజీ-1, ఎకనామిక్స్-1 సబ్జెక్టులకు సంబంధించి పార్ట్ టైమ్ ప్రాతిపదికన పని చేసేందుకు పీజీ పూర్తి చేసిన, ఆసక్తి గల మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. నెట్, సెట్ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ నెల 9న నిర్వహించే డెమోకు సంబంధిత సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలలోపు హాజరుకావాలని సూచించారు.

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై ఎందుకంత ఉలికిపాటు?



మాట్లాడుతున్న రఘు నాయక్

షాద్‌నగర్: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై షాద్‌నగర్ స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఎందుకు ఉలిక్కి పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ రఘు నాయక్ ప్రశ్నించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. షాద్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ నేతల ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఎవరి పేర్లు ఎక్కడా తాము ప్రస్తావించలేదని అన్నారు. కొందరు బీఆర్ఎస్ నేతలు సమావేశాలు ఏర్పాటు చేసి ఎమ్మెల్యేకు అల్టిమేటం ఇచ్చే విధంగా మాట్లాడటం సరికాదన్నారు. ఈ విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, నాయకులు హరినాథ్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి



అభివాదం చేస్తున్న బీసీ సంఘం నేతలు

తుక్కుగూడ: రాష్ట్రంలో ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ డిమాండ్ చేశారు. పురపాలిక కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో శనివారం బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీలకు ఇచ్చిన హామీని నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మభ్య పెడుతోందని విమర్శించారు. రానున్న రోజుల్లో అన్ని పార్టీలు బీసీలకు అధిక స్థానాలు కేటాయించాలన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 22 జిల్లాలో సభలు నిర్వహించి, కమిటీలు వేసి, బీసీలను రాజకీయంగా, సామాజికంగా చైతన్య పరచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సంఘం సమన్వయ కర్తలు కర్నాటి మనోహర్, గండి వీరేందర్, రచ్చ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విహారం.. విషాదం

పర్యాటకుల ప్రాణాలకు రక్షణ కరువు

- అనుమతి లేకుండా కొనసాగుతున్న రిసార్ట్‌లు
- ప్రమాదకర స్థితిలో బోటింగ్
- సేఫ్టీని పట్టించుకోకుండా అడ్వెంచర్ గేమ్స్
- పాలకులు, అధికారుల కనుసన్నల్లోనే తతంగం
- తాజాగా సర్పన్‌పల్లి ప్రాజెక్టులో బోటు బోల్తాపడి ఇద్దరు మహిళల మృతి



సర్పన్‌పల్లి ప్రాజెక్టులో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న బోటింగ్

వికారాబాద్: ప్రాజెక్టుల్లో అనుమతులు లేకుండా కొనసాగుతున్న బోటింగ్ పర్యాటకుల ప్రాణాలు తీస్తోంది. ఎలాంటి రక్షణ చర్యలు లేకుండా.. కాలం చెల్లిన బోట్లను నడుపుతున్న నిర్వాహకులు ఇందుకు కారణమవుతున్నారు. వికారాబాద్ సమీపంలోని సర్పన్‌పల్లి ప్రాజెక్టులో బోటింగ్ చేస్తూ శనివారం ప్రమాదవశాత్తు ఇద్దరు మహిళలు చనిపోవడం, మరో ఇద్దరిని స్థానికులు కాపాడటం జిల్లాలో చర్చనీయాంశమైంది.

- సర్పన్‌పల్లి ప్రాజెక్టు పరిసర రిసార్ట్‌లో ఇది వరుసగా మూడో ఘటన కావడం గమనార్హం.
- గతంలోనూ ఇక్కడే అడ్వెంచర్ గేమ్స్ ఆడుతూ బావిలో మునిగి ఓ వ్యక్తి మృతి చెందాడు.
- ఇదే రిసార్ట్‌లో అడ్వెంచర్ గేమ్‌లో భాగంగా కారు నడుపుతూ బోల్తాపడి మరో వ్యక్తి మరణించాడు.

యథేచ్ఛగా దందా

- జిల్లాలో రిసార్ట్‌ల దందా యథేచ్ఛగా సాగుతోంది.
- ఇటీవల హైదరాబాద్ నుంచి వచ్చే పర్యాటకుల తాకిడి కూడా పెరగటంతో వీరి వ్యాపారం జోరుగా సాగుతోంది.
- రిసార్ట్‌ల నిర్వహణకు 11 రకాల అనుమతులు అవసరం ఉండగా అందులో ఏ ఒక్కటీ లేకపోవడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది.
- వికారాబాద్, పూడూరు, ధారూరు, నవాబుపేట, మోమిన్‌పేట తదితర మండలాల్లో గత ఐదారేళ్లుగా రిసార్ట్‌లు కొనసాగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.
- ఇందులో బోటింగ్, నైట్ క్యాంపింగ్, పలు రకాల అడ్వెంచర్ గేమ్స్, ట్రెక్కింగ్, గేమింగ్, హోటల్స్, రాత్రి బస చేసేందుకు గదుల ఏర్పాటు, పేకాట, మద్యం సేవించటం తదితర కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు.
- ఒక్క రాత్రి బస చేసేందుకు అక్కడ కల్పించే సౌకర్యాలు, అడ్వెంచర్ గేమ్స్‌ను బట్టి ఒక్కో జంటకు రూ.2,500 నుంచి 20 వేల వరకు వసూలు చేస్తున్నారు.
- వీటిపై వెల్లువెత్తిన విమర్శల నేపథ్యంలో వికారాబాద్ మండల పరిధిలోని ఆరు రిసార్ట్‌లకు నోటీసులు ఇచ్చిన అధికారులు అనుమతులు లేవని తేలడంతో ఆరు నెలల క్రితం మూసేశారు. మరికొన్ని చోట్ల కొనసాగుతున్న వాటిని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

చేయి తడిపితే సక్రమం

- రిసార్టుల నిర్వహణలో అధికారుల నిర్ణయాలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి.
- ఐదారేళ్ల పాటు కొనసాగిన వీటిని అక్రమమంటూ ఆర్నెళ్ల క్రితం మూసేసిన అధికారులు నెల తిరగకుండానే మళ్లీ తెరిపించారు.
- ఈకొద్ది సమయంలోనే రిసార్టులు సక్రమం ఎలా అయ్యాయో వారికే తెలియాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.
- కొందరు ప్రజా ప్రతినిధులతో పాటు జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులకు ముడుపులు ముట్టినందునే మళ్లీ ఓపెన్ చేసుకునేందుకు అవకాశం ఇచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- గత ప్రభుత్వ హయాంలో, ప్రస్తుత కాంగ్రెస్ పాలలోనూ ఆయా పార్టీలకు చెందిన నేతల అండదండలతోనే రిసార్ట్‌లు కొనసాగుతున్నాయని సమాచారం.



వార్షిక రుణ ప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్ తదితరులు

ప్రభుత్వ లక్ష్యాలు నెరవేర్చాలి

- అదనపు కలెక్టర్ సుధీర్

అనంతగిరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలు, రైతులకు, ఇతర పథకాలకు ఇచ్చే రుణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ సుధీర్ సూచించారు. ఉపాధి అవకాశాలపై యువత, మహిళలకు అవగాహన కల్పించి వారికి ఆర్థిక చేయూతనివ్వడం ద్వారా ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలన్నారు. శనివారం వికారాబాద్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో త్రైమాసిక డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. రుణాల మంజూరుపై ఆయా బ్యాంకర్లతో చర్చ జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బ్యాంకు లింకేజ్ రుణాలను పెండింగ్ ఉంచరాదని సూచించారు. స్వయం సహాయక సంఘాల రుణాలను వెంటనే అందజేయాలని ఆదేశించారు. బ్యాంకులకు నిర్దేశించిన వార్షిక లక్ష్యాలను అధిగమించాలన్నారు. సామాజిక, ఆర్థిక స్థిరత్వం సాధించడంలో మహిళల పాత్రను పెంపొందించేందుకు రుణాలు అందించాలని తెలిపారు.రుణాలు ఇచ్చే ప్రక్రియలో పారదర్శకత, వేగం అవసరమని స్పష్టం చేశారు. బ్యాంకులు, రుణగ్రహీతల మధ్య సమన్వయానికి ప్రాధాన్యం ఇచ్చి, అవసరమైన చోట ప్రభుత్వ యంత్రాంగం జోక్యం చేసుకోవాలని సూచించారు. రుణాల మంజూరులో సమస్యలు ఎదురవుతున్న చోట వాటిని వెంటనే పరిష్కరించాల్సిన బాధ్యత బ్యాంకర్లదేనని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాల ద్వారా సామాజిక ప్రయోజనాలను సాధించడానికి బ్యాంకుల సహకారం కీలకమని స్పష్టం చేశారు. అర్హులైన రైతులకు సకాలంలో రుణాలు అందించి ఆదుకోవాలని, పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఈ రుణాలు సకాలంలో ఇవ్వాలని పేర్కొన్నారు. రిజర్వ్ బ్యాంక్ సూచనల మేరకు నూరు శాతం డిజిటల్ సేవలు అందించేలా కృషి చేయాలని, దీనికి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా పొటెన్షియల్ లింక్డ్ ప్లాన్ (పీఎల్‌పీ) 2025-26 వార్షిక రుణ ప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్, లీడ్ బ్యాంక్ మేనేజర్ యాదగిరి, నాబార్డ్ మేనేజర్ హర్ష, పరిశ్రమల శాఖ జిల్లా అధికారి మహేశ్వర్, ఎస్సీ కార్పొరేషన్ జిల్లా అధికారి బాబు మోజెస్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటర్ల వివరాలు పరిశీలించాలి

ధారూరు: ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల వివరాలు పరిశీలించాలని అదనపు కలెక్టర్ సుధీర్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బూత్ లెవల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు ఉంటే క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఫామ్ 6, 7, 8 జాబితాలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అవసరమైన చోట పాత ఫొటోలు తీసేసి కొత్త వాటిని అప్‌లోడ్ చేయాలన్నారు. కుటుంబ సభ్యులంతా ఒకే బూత్‌లో ఓటు వేసేలా అవకాశం కల్పించాలని ఆదేశించారు. మరణించిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ లలితాదేవి

అప్రమత్తంగా ఉండండి

- సీజనల్ వ్యాధులు ప్రబలితే తక్షణం స్పందించాలి
- డీఎంహెచ్ఓ డాక్టర్ లలితాదేవి

అనంతగిరి: వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగ్యూ కేసులు పెరిగే అవకాశం ఉందని వైద్యులు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ డాక్టర్ లలితాదేవి ఆదేశించారు. సబ్ యూనిట్ ఆఫీసర్లు వారివారి పరిధిలో విస్తృతంగా పర్యటిస్తూ సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు. శనివారం వికారాబాద్ పట్టణంలోని ఐడీఓసీ కాంప్లెక్స్ హాల్‌లో సబ్ యూనిట్ ఆఫీసర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆరోగ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మలేరియా లేదా డెంగ్యూ కేసులు నమోదైతే వెంటనే కుటుంబంలోని వారికి, చుట్టుపక్కల వారికి రక్త పరీక్షలు చేయాలేని ఆదేశించారు. రక్త పరీక్షల కోసం రోగులు ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్లకుండా చూసుకోవాలన్నారు. సేకరించిన రక్త నమూనాలను టీ హబ్ పంపి పరీక్షలు చేయించాలని ఆదేశించారు. ఆస్పత్రి పరిసరాలు, ల్యాబ్‌లు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రజలు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా ఆరోగ్య కార్యకర్తలు అవగాహన కలిగించాలని తెలిపారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరించాలన్నారు. ఆహార పదార్థాలు, కలుషిత నీటిపై తగు జాగ్రత్తలు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓలు డాక్టర్ రవీంద్ర యాదవ్, డాక్టర్ ప్రవీణ్ కుమార్, డిప్యూటీ డెమో శ్రీనివాసులు ఏఎంఓ సత్యం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మలేరియా నియంత్రణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న అధికారులు, సిబ్బంది

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజుకుమార్ గౌడ్

కొడంగల్ రూరల్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజుకుమార్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు.శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలల యాజమాన్యాలు ఫీజు కట్టకుంటే సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. దీంతో ఉన్నత చదువులకు వెళ్లలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం కళాశాలల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర వ్యాప్తంగా జూలై 5, 6, 7 తేదీల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రభుత్వం స్పందించి వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజు, నరేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్ రూరల్: నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బకాయిలు విడుదల చేయాలి

పరిగి: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్ డిమాండ్ చేశారు. శనివారం పరిగి ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

ఆలయ అభివృద్ధి వేగంగా జరగాలి

- అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్

కొడంగల్: పట్టణంలోని పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని శనివారం అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్ సందర్శించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆస్థాన మండపంలో అర్చకులు ప్రసాదం అందజేశారు. అనంతరం ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులు, పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం, తిరుమల తిరుపతి దేవస్థానం చేపట్టిన పనుల వివరాలు తెలియజేశారు. ఆలయ విస్తరణలో భాగంగా ఇండ్లు కోల్పోతున్న వారికి పట్టణ శివారులోని జాతర స్థలంలో అన్ని వసతులతో కూడిన వెంచర్‌లో ఇంటి స్థలాలు ఇస్తామన్నారు. వెంచర్ పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, ఈఓ రాజేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్, ఆలయ ధర్మకర్తలు నందారం శ్రీనివాస్, రత్నం, రాజు తదితరులు పాల్గొన్నారు.



వెంచర్‌ను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, ఇతర అధికారులు

పోతులవాగు స్వాహా..!

- పొలంలో కలుపుకొన్న కబ్జాదారు
- 'కోట్‌పల్లి' కాలువ రోడ్డునూ వదలని వైనం
- అటవీ, ఇరిగేషన్, రెవెన్యూ భూములు అన్యాక్రాంతం
- దాదాపు 20 ఎకరాలు ఆక్రమణ
- పరిశీలించిన అధికారులు
- కలెక్టర్‌కు రైతుల ఫిర్యాదుతో విషయం వెలుగులోకి



పోతులవాగును పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఈఈ మధుసూదన్‌రెడ్డి, ఇతర అధికారులు

ధారూరు: ఇటీవల ఓ వ్యక్తి తన కూతుళ్ల పేరిట కొనుగోలు చేసిన పొలం పక్క నుంచి వెళ్తున్న వాగును పూర్తిగా కబ్జా చేశాడు. అంతటితో ఆగకుండా కోట్‌పల్లి ప్రాజెక్టు కుడి కాలువ రోడ్డును దున్నేసి తన భూమిలో కలుపుకొన్నాడు.. అటవీ, ఇరిగేషన్, రెవెన్యూ శాఖలకు చెందిన దాదాపు 20 ఎకరాల భూమిని ఆక్రమించాడు.. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ధారూరు మండలం అల్లాపూర్ నుంచి పోతులవాగు ప్రారంభమవుతుంది. ఆరు కిలోమీటర్ల మేర ప్రవహించి కాగ్నా నదిలో కలుస్తుంది.. మధ్యలో ఈ వాగు దాదాపు అర కిలోమీటరు కబ్జాకు గురైంది. నల్లగొండ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి ఏడాది క్రితం తన ఇద్దరు కూతుళ్ల పేరిట 41 ఎకరాల 34 గుంటల భూమిని ఖరీదు చేశాడు. ఈ పొలం పక్క నుంచి వెళ్తున్న పోతులవాగుపై కన్నేశాడు. 20 ఎకరాల మేర వాగును ఆక్రమించాడు. ఇందులో అటవీ శాఖకు చెందిన 10 ఎకరాల భూమి ఉన్నట్లు తెలిసింది. అంతటితో ఆగకుండా సమీపంలోని కోట్‌పల్లి ప్రాజెక్టు కుడి కాలువ రోడ్డుపై ఇతని కన్ను పడింది. కాలువ పక్క రోడ్డును జేసీబీతో చదును చేశాడు. దీంతో కాలువలోని నీరంతా వృథాగా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని గత నెల 30న పలువురు రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు శనివారం వికారాబాద్ ఇరిగేషన్ శాఖ ఈఈ పీ మధుసూదన్‌రెడ్డి, డీఈలు భాస్కర్, రవికుమార్, ధారూరు ఆర్ఐ స్వప్న తదితరులు పోతులవాగును సందర్శించారు. దాదాపు అర కిలోమీటరు మేర వాగు కబ్జాకు గురైనట్లు గుర్తించారు. రాళ్లతో గోడకట్టి వాగు ఆనవాళ్లు లేకుండా చేశాడని తేల్చారు. వాగును ఆక్రమించడం ద్వారా ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వర్షపు నీరు కాగ్నా నదిలోకి వెళ్లే పరిస్థితి ఉండదు. వాగును మధ్యలో ఆక్రమించడం ద్వారా వరద నీరు పక్క రైతుల పొలాల్లో చేరే అవకాశం ఉంది. దీంతో ఆయా భూముల రైతులు ఆందోళన చెందుతున్నారు.



ఆక్రమణకు గురైన అటవీ భూమి

కబ్జా వాస్తవం

ఓ వ్యక్తి తన కూతుళ్ల పేరిట భూమి కొనుగోలు చేశాడు. ఆ పొలం పక్క నుంచి ప్రవహించే పోతుల వాగును కబ్జాచేసి కాలువలా మార్చాడు. మా తనిఖీల్లో ఈ విషయం బయటపడింది. అలాగే కోట్‌పల్లి ప్రాజెక్టు కుడి కాలువ పక్కన ఉన్న రోడ్డును దున్నేశాడు. దీంతో కాలువకు ప్రమాదం పొంచి ఉంది. ఆక్రమణలపై సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేస్తాం.

– మధుసూదన్‌రెడ్డి, ఇరిగేషన్ ఈఈ, వికారాబాద్

అటవీ భూమి కూడా..

అటవీ శాఖకు చెందిన దాదాపు 4నుంచి 5 ఎకరాల భూమి కబ్జాకు గురైందని అంచనా వేశాం. భూయజమాని పొలం పక్కనే సర్వే నంబర్ 11లో 127. 39 ఎకరాల అటవీ భూమి ఉంది. అందులో కొంత మేర ఆక్రమణకు గురైంది. ఈ విషయాన్ని డీఎఫ్ ఓ కు నివేదిక ఇస్తాం. ఫారెస్ట్, రెవెన్యూ శాఖల జా యింట్ సర్వే చేస్తే ఎంతమేర భూమి కబ్జాకు గురైందో తెలుస్తుంది.

– రాజేందర్, ధారూరు ఫారెస్టు రేంజర్

క్లుప్తంగా

రేపు స్క్రీనింగ్ క్యాంపు

అనంతగిరి: పిల్లల్లో, పెద్దవాళ్లలో పుట్టుకతో వచ్చే లోపాలు, ప్రమాదవశాత్తు ఏర్పడిన అంగవైకల్యం లోపాలను సరిదిద్దడం కోసం జిల్లా వైద్యాశాఖ-ఆకార్ ఆశ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పూడూర్ మండలకేంద్రం లోని ప్రభుత్వ ఆస్పత్రిలో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారని జిల్లా వైద్యాధికారి లలితాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నేడు ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి పర్యటన

తాండూరు: చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తాండూరు పట్టణంలో పర్యటించనున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యు.రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం మధ్యాహ్నం పట్టణంలోని వీరశైవ కల్యాణ మండపం వద్ద సీసీ రోడ్డు పనులను ప్రారంభించనున్నారు. అనంతరం టీయుపీఎస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జరిగే సమావేశానికి హాజరవుతారని ఆయన తెలిపారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

అనంతగిరి: జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన విద్యార్థులు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డి.విజయభాస్కర్‌రెడ్డి, సెలక్షన్ టెస్ట్ ఇన్‌చార్జి దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 2026–27 విద్యా సంవత్సరం ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్ష డిసెంబర్ 13న నిర్వహిస్తారని పేర్కొన్నారు. జులై 29 వరకు దరఖాస్తు చేసుకోవాలని వారు తెలిపారు. మొత్తం 80 సీట్లు ఉండగా ఎస్టీలకు 7.5శాతం, ఎస్సీలకు 15శాతం, పీహెచ్‌సీ విభాగంలో 3శాతం, ఓబీసీలకు 27శాతం చొప్పున సీట్లు కేటాయించారని తెలిపారు. విద్యార్థులు 1-5-2014 నుంచి 31-7-2016 మధ్య జన్మించిన వారై ఉండాలని తెలిపారు. ప్రవేశ పరీక్షలో మెంటల్ ఎబిలిటీకి 50మార్కులు, గణితం 25మార్కులు, లాంగ్వెజెస్‌కు 25 మార్కుల చొప్పున ఉంటాయని వివరించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగించుకోవాలని సూచించారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి


లఘులయ్య (ఫైల్)


మొయినాబాద్‌రూరల్: అనారోగ్యంతో బాకారం జాగీరు వీఆర్‌ఏ కావలి లఘులయ్య శనివారం మృతి చెందారు. మండల పరిధి బాకారంలో వీఆర్‌ఏగా విధులు నిర్వహించిన ఆయన.. కొద్దిరోజులుగా తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్నారు. ఇటీవలే కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యాడు. ఈ క్రమంలో ఆరోగ్య సమస్యలతో ఆయన చికిత్స పొందుతూ చనిపోయాడు. కొత్తపల్లి రాఘవరెడ్డి, సుధాకర్‌యాదవ్, తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు తిరుపతిరెడ్డి పలువురు ఆయన మృతికి సంతాపం తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

మీర్‌పేట: షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని సామగ్రి కాలి బూడిదైన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజశేఖర్ కథనం ప్రకారం.. మీర్‌పేట మారుతీనగర్‌లో నివాసముండే వరప్రసాద్.. భార్య లక్ష్మీప్రసన్నతో కలిసి మూడు రోజుల క్రితం బెంగళూరుకు వెళ్లాడు. ఇంట్లో ఉన్న కుమారుడు శనివారం సాయంత్రం వేళ తాళం వేసి, బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా మొదటి అంతస్తు బెడ్‌రూములో నుంచి మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా, వారు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే గదిలోని వస్తువులు, విలువైన పత్రాలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఏసీ ఆన్ చేసి ఉంచడం వలనే ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నజాతర ప్రారంభం


ఉత్సవాలను ప్రారంభిస్తున్న ట్రస్టీ పద్మనాభం


ఆలయ ఆవరణలో ఆంజనేయ స్వామి విగ్రహం

ధ్వజారోహణంతో మొదలైన పద్మనాభ స్వామి ఉత్సవాలు

- 10న పెరుగు బసంతం
- భక్తుల కోసం చురుగ్గా ఏర్పాట్లు

అనంతగిరి: అనంతగిరి గుట్టపై వెలసిన శ్రీఅనంత పద్మనాభస్వామి ఆలయంలో ఆషాఢమాసం చిన్న జాతర శనివారం సాయంత్రం ఘనంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా సాయంత్రం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో ధ్వజారోహణ కార్యక్రమం ద్వారా ఉత్సవాలకు అంకురార్పణ చేశామని ఆలయ ప్రధాన ట్రస్టీ పద్మనాభం తెలిపారు. ఇక్కడ ఏటా రెండు సార్లు ఉత్సవాలు కొనసాగుతాయి. ఆషాఢ మాసంలో ఆరు రోజుల పాటు చిన్నజాతర, కార్తీక మాసంలో 16రోజుల పాటు పెద్ద జాతర నిర్వహిస్తారు. ప్రస్తుతం మొదలైన చిన్నజాతరలో భాగంగా ఆదివారం తొలి ఏకాదశి చతుర్మాస్య ఆరంభ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్పష్టంచేశారు.

పౌర్ణమి రోజున..

ఉత్సవాల్లో భాగంగా గురువారం పౌర్ణమి రోజున మధ్యాహ్నం 2.30 గంటలకు గరుడ వాహన సేవ, ఊరేగింపు, పెరుగు బసంతం ఉంటుంది. ఆషాఢ శుద్ధదశమిన ప్రారంభమయ్యే సంబరాలు పౌర్ణమితో ముగుస్తాయి. ఈ వేడుకలకు వికారాబాద్ చుట్టు పక్కల ప్రాంతాలతో పాటు హైదరాబాద్, మహబూబ్‌నగర్, బీదర్, తాండూరు, సంగారెడ్డి, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. స్థానిక ఎమ్మెల్యే, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. వేడుకలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఈవో నరేందర్, ట్రస్టీ పద్మనాభం తెలిపారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారి ఆశీస్సులు పొందాలని సూచించారు.

వృక్ష సంపదతోనే మానవ మనుగడ

- పట్టణాల్లో అటవీ సంపద పెంచాలి
- డీఎస్పీ బాలకృష్ణారెడ్డి


మొక్క నాటుతున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు: వృక్ష సంపదతోనే మానవ మనుగడ సాధ్యమని డీఎస్పీ బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం తాండూరు పట్టణంలోని చైతన్య పాఠశాల విద్యార్థులతో కలిసి గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమంలో భాగంగా పచ్చదనంపై ప్రజలను చైతన్యం కల్పించేందుకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ..మానవ జాతి మనుగడకు చెట్లు ప్రధానమన్నారు. పట్టణ ప్రాంతంలో మొక్కలను నాటి సామాజిక అటవీ సంపదను పెంచడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ అంబరయ్య, కానిస్టేబుల్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన పిల్లలు పరిగిలో ప్రత్యక్షం


శృతి


అనూష

కుల్కచర్ల: ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైన పిల్లలు 22కిలోమీటర్ల దూరంలోని నియోజకవర్గ కేంద్రంలో ప్రత్యక్షమైన ఘటన కుల్కచర్ల మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ముజాహిద్‌పూర్ గ్రామానికి చెందిన ఎరుకలి గోపికి ఇద్దరు కూతుళ్లు. శుక్రవారం రాత్రి సుమారు 7గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పిల్లలు ఎంతకు రాకపోవడంతో కుటుంబీకులు ఆందోళనకు గురయ్యారు. చుట్టు ప్రక్కల, తెలిసినవారి దగ్గర, బంధువుల వద్ద వెతికినా ప్రయోజనం లేదు. శనివారం ఉదయం కుల్కచర్ల పోలీస్‌స్టేషన్‌లో తండ్రి గోపి కూతుళ్లు శృతి(8), అనూష(5) కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు చైల్డ్ వెల్ఫేర్ శాఖలో ఈ కేసు వివరాలు నమోదు చేశారు. ఎంట్రీ చేయడంతో వారు కుల్కచర్ల ఎస్‌ఐ రమేష్‌ను సంప్రదించారు. కుల్కచర్ల కార్యదర్శి భాస్కర్ గుర్తు తెలియని పిల్లలు కుల్కచర్లలో ఉన్నారన్న సమాచారంతో శృతి, అనూషలను తాము పరిగి బాలసదనంలో చేర్పించానని ఆయన తెలిపారు. దీంతో ముజాహిద్‌పూర్ గ్రామం నుంచి వారు కుల్కచర్లకు ఏవిధంగా వచ్చారనే విషయం ఆశ్చర్యకరంగా మారింది.

భక్తిశ్రద్ధలతో పీర్ల పండుగ


మటికీలు సమర్పించేందుకు ర్యాలీగా వెళ్తున్న ముస్లింలు


హస్నాబాద్ మసీదులో ఏర్పాటు చేసిన పీర్లు

ర్యాలీగా మటికీల సమర్పణ

- నేడు పీరీల నిమజ్జనం

దుద్యాల్: మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. దుద్యాల్, హస్నాబాద్, గ్రామాల్లో పీర్లు ఏర్పాటు చేసిన మసీదుల ముందు నిత్యం రాత్రి వేళల్లో మహిళలు బొడ్డెమ్మలు, పురుషులు అలై ఆటలు ఆడుతున్నారు. ఇందులో భాగంగా శనివారం 9వ రోజు కావడంతో హస్నాబాద్ గ్రామానికి చెందిన ముస్లింలు ర్యాలీగా వెళ్లి పీర్లకు మటికీలను(ఊదు, బెల్లం) సమర్పించారు. ఏటా ఈ సంప్రదాయం కొనసాగుతోందని ఉత్సవాల నిర్వాహకులు తెలిపారు. ఆదివారం చివరి కావడంతో పీర్ల నిమజ్జన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ప్రజలందరూ కులమతాలకు అతీతంగా పండుగల్లో పాల్గొనాలని కోరారు.

సంపులో పడి వ్యక్తి మృతి

ఇబ్రహీంపట్నం రూరల్: నిర్మాణంలో ఉన్న ఇంటి సంపులో పడి ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజు కథనం ప్రకారం.. తుర్కయంజాల్ మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన కొమ్మని గిరిబాబు(36).. కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. రాత్రి సమయంలో ప్రమాదవశాత్తు సంపులో పడి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మద్యం దుకాణంలో చోరీ

ఇబ్రహీంపట్నం: మద్యం దుకాణంలో గుర్తు తెలియని దుండగులు చొరబడి 20 ఫుల్ బాటిళ్లను అపహరించారు. ఈ సంఘటన శనివారం తెల్లవారుజామున ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మంగల్‌పల్లి క్రాస్ రోడ్డు వద్ద కనకదుర్గ వైన్స్ పై కప్పు రేకులను దుండగులు తొలగించి, మద్యం సీసాలను ఎత్తుకెళ్లారు. దుకాణ యాజమాని శ్రీకాంత్‌రావు ఫిర్యాదు మేరకు.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

డెబిట్ కార్డు మార్చి.. డబ్బులు కాజేసి..

నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

సనత్‌నగర్: డెబిట్ కార్డు చోరీ చేసి నగదు కాజేసిన ఆగంతకుడిపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూసాపేటకు చెందిన వి. వెంకటేశ్వరరావు ఈ నెల 2న సాయంత్రం నగదు తీసుకునేందుకు భరత్‌నగర్‌లోని ఎస్ బీఐ ఏటీఎంకు వెళ్లాడు. డెబిట్‌కార్డును ఏటీ ఎంలో పెట్టి పిన్ నెంబర్ ఎంటర్ చేశాడు. నగదు రాకపోవడంతో మరో రెండు, మూడుసార్లు ప్రయత్నించాడు. అయినా డబ్బులు రా కపోవడంతో వెనుకాల ఉన్న వ్యక్తి తాను ప్ర యత్నిస్తానని చెప్పి వెంకటేశ్వరరావు వద్ద డెబిట్‌కార్డు తీసుకుని ఏటీఎంలో పెట్టి ప్రయత్నించాడు. నగదు రావడం లేదని చెప్పి కార్డును తిరిగి ఇచ్చి వెళ్లిపోయాడు. వెంకటేశ్వరరావు కూడా ఇంటికి వెళ్లాడు. అతని సెల్‌ఫోన్‌కు మూడు దఫాలుగా మొత్తం రూ.40 వేలు డ్రా చేసినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో కంగుతిన్న బాధితుడు తన డెబిట్‌కార్డు చూసుకోగా అది తనది కాదని గ్రహించాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నివాళి


యాదమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సబితారెడ్డి

చేవెళ్ల: ముడిమ్యాలకు చెందిన డీసీసీ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ నేత పడాల వెంకటస్వామి సతీమణి, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు పడాల యాదమ్మ(70) శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు ప్రముఖులు శనివారం ఆమె భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు. వీరిలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు ఉన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య


నరేష్ (ఫైల్)

కేశంపేట: తండ్రి మరణం, దానికి తోడు ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తలకొండపల్లి మండలం వెంకటపూర్ గ్రామానికి చెందిన మద్దూరి నరేష్(26).. తండ్రి అంజయ్య ఏడు నెలల క్రితం మృతి చెందాడు. తండ్రి మరణాన్ని జీర్ణించుకోలేని తనయుడు.. నాటి నుంచి తీవ్ర మనస్తాపంతో కృంగిపోయేవాడు. ఈ క్రమంలో కేశంపేట గ్రామంలో ఉంటున్న అక్క మాధవి ఇంటికి ఈ నెల 2న నరేష్ వచ్చాడు. 3వ తేదీ రాత్రి ఇంట్లో గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన సోదరి.. యువకుడిని అంబులెన్స్‌లో ఉస్మానియాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ.. శనివారం మృతి చెందాడు. మృతుడి తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామని సీఐ నరహరి తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న మశ్చేందర్‌తో కానిస్టేబుల్ జాషువా

కాపాడిన కానిస్టేబుల్


ఆమనగల్లు: కుటుంబ సభ్యులతో గొడవపడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడిని కానిస్టేబుల్ కాపాడారు. ఈ సంఘటన శనివారం తలకొండపల్లిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. తలకొండపల్లి మండలం మెదక్‌పల్లి గ్రామానికి చెందిన దరువుల మశ్చేందర్.. ఇంట్లో గొడవపడి వెళ్లిపోయాడు. కుటుంబీకులు వెతికినప్పటికీ అతడి ఆచూకి లభించలేదు. దీంతో వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనికి వెంటనే స్పందించిన కానిస్టేబుల్ జాషువా.. యువకుడి సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా ఎక్కడున్నారో తెలుసుకున్నారు. అక్కడికి వెళ్లే సరికి మశ్చేందర్ పురుగుల మందు తాగి బలవన్మరణానికి యత్నించాడు. వెంటనే కానిస్టేబుల్.. కు టుంబీకులకు సమాచారం అందించి, ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయించాడు. సకాలంలో స్పందించి యువకుడి ప్రాణాలు కాపాడిన కానిస్టేబులన్‌ను ఎస్‌ఐ శ్రీకాంత్ అభినందించారు.

ముగిసిన వారాహిదేవి నవరాత్రులు


పూర్ణాహుతి కార్యక్రమం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని కుర్తాళం పీఠం శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి దేవాలయంలో ఉత్తర పీఠాధిపతి దత్తేశ్వరానంద భారతి మహాస్వామి వారి సమక్షంలో వారాహి దేవి నవరాత్రులు తొమ్మిది రోజులు ఘనంగా నిర్వహించారు. లోక కల్యాణం, ధర్మ పరిరక్షణ కోసం ఈ నవరాత్రులు నిర్వహించినట్లు దత్తేశ్వరానంద భారతి మహాస్వామి తెలిపారు. పూర్ణాహుతితో శనివారం ఉత్సవాలు ముగిశాయన్నారు. కాగా డిప్యూటీ సీఎం సతీమణి నందిని, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషనర్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి దంపతులు శనివారం వారాహి దేవి పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ వారాహి నవరాత్రులు తొమ్మిది రోజులు ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలను నుండి భక్తులు తరలివచ్చి పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారని తెలిపారు. ఆలయ ప్రతినిధులు విఠల్ శర్మ, రామకృష్ణ, విజయలక్ష్మి, నీలిమ, నిఖిల్, మహేష్, కృష్ణ, రామకృష్ణ, అరుణ, హేమ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు వ్యాఖ్యలు చేశారంటూ ఫిర్యాదు


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

బంజారాహిల్స్: ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై తప్పుడు వ్యాఖ్యలు చేసిన ఐడ్రీమ్స్ చానల్ యాంకర్ సౌమ్యారెడ్డి, అడ్వొకేట్ అరుణ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నేతలు శనివారం బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత నెల 25వ తేదీన అరుణ్‌కుమార్ అనే అడ్వొకేట్‌తో సదరు ఛానల్ యాంకర్ ఇంటర్వ్యూ చేసి ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ పేరును వాడుతూ..అబద్ధపు మాటలతో తప్పుడు ఆరోపణలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. యాంకర్‌తో పాటు అడ్వొకేట్, చానల్ యాజమాన్యం మీద చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో నేతలు వాసుదేవరెడ్డి, గాంధీనాయక్, బమ్మెర రామ్మూర్తి, కురువ పల్లయ్య తదితరులు ఉన్నారు. బంజారాహిల్స్ పోలీసులు ఫిర్యాదును స్వీకరించి దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి అదృశ్యం

మియాపూర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి రాని సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ జనప్రియ అపార్ట్‌మెంట్‌లో హన్మంతరావు(57) నివాసముంటున్నాడు. మియాపూర్ కల్వరి టెంపుల్ సమీపంలో టైలరింగ్ షాపు నిర్వహిస్తున్నాడు.ఏప్రిల్ 3వ తేదీ ఉదయం హన్మంతరావు 8 గంటల సమయంలో టైలరింగ్ షాపునకు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. రాత్రి 11 గంటలు అయినా హన్మంతరావు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఏప్రిల్ 7వ తేదీ హన్మంతరావు వాట్సప్‌లో విజయవాడలో ఉన్నట్లు కుటుంబ సభ్యులకు మెసేజ్ పంపించాడు. ఈ క్రమంలో జూన్ 4వ తేదీ వరకు కుటుంబ సభ్యులతో వాట్సప్‌లో మాట్లాడుతూ ఉన్నాడు. ఆ తర్వాత నుంచి మాట్లాడకపోవడంతో ఆందోళన చెంది మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సాగు కళకళ

ఆశాజనకంగా వర్షాధార పంటలు

- ముమ్మరంగా కలుపు తీత పనులు

కొడంగల్: నియోజకవర్గంలోని నల్లరేగడి భూముల్లో వేసిన కంది, పత్తి, పెసర, మినుము పంటలు కళకళలాడుతున్నాయి. రైతులు సాగు చేసిన చేలల్లో కలుపు తీసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పైరు ఏపుగా పెరగడానికి రైతులు డీఏపీ, కాంప్లెక్స్ తదితర ఎరువులను వాడుతున్నారు. కూలీల దినసరి వేతనం పెరగడంతో సాగు ఖర్చులు పెరిగిపోతున్నాయి.

మంచి డిమాండ్..

కొడంగల్ నియోజకవర్గంలో పండించిన కంది పప్పునకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. గింజ పెద్ద సైజులో ఉండటంతో పాటు రుచి బాగుంటుంది. కొడంగల్ ప్రాంతంలోని నల్లరేగడి భూముల్లో పండించిన కంది పప్పును తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు.

పత్తిపై ఆసక్తి..

వాణిజ్య పంట పత్తిపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలోని 20 వేల హెక్టార్లల్లో ఈ పంట వేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ధర ఆశాజనకంగా ఉండటంతో ఎక్కువ మంది సాగు చేస్తున్నారు.

సంప్రదాయ పంటలు కనుమరుగు

సంప్రదాయ పంటల సాగు కనుమరుగవుతోంది. తక్కువ వ్యవధిలో ఎక్కువ దిగుబడి, లాభాలిచ్చే పంటలవైపు కర్షకులు మొగ్గు చూపుతున్నారు. ఈనేపథ్యంలో జొన్న, రాగులు, కొర్రలు వంటివి ఎక్కడా కనిపించడం లేదు.

పంటలకు ప్రాణం పోస్తున్న చిరు జల్లులు

దుద్యాల్: మండలంలో సాగు చేసిన మెట్ట పంటలకు తేలికపాటి వానలు ప్రాణం పోస్తున్నాయి. వారం రోజులు దాటకుండా పడుతున్న చిరు జల్లులు ఆరుతడి పంటలకు ఆయువు పట్టుగా నిలుస్తున్నాయి. ప్రస్తుతం జొన్న, మొక్కజొన్న, కంది, పెసర, బొబ్బెర చేలు వేగంగా ఎదుగుతూ కళకళలాడుతున్నాయి. ఆలేడ్, లగచెర్ల, ఈర్లపల్లి, హకీంపేట, చెట్టుపల్లితండా, ముచ్చుకుంటతండా, సోమ్లా నాయక్‌తండా, చిలుముల మైల్వార్‌లో ఆరుతడి పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. వీటిలో కలుపుతీత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇదిలా ఉండగా వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు పూర్తయినా ఒక్క భారీ వర్షం కూడా కు రవకపోవడంతో రైతన్నలు ఆందోళనకు గురవుతున్నారు. భూగర్భ జలాలు తగ్గిపోవడంతో బోర్ల నుంచి నీ రు రావడం లేదని ఆవేదన వ్య క్తంచేస్తున్నారు. దీంతో వరి నాట్లు ముందుకు సాగడం లేదని చెబుతున్నారు.


కొడంగల్: కంది పంటలో కలుపు తీస్తున్న కూలీలు


దుద్యాల్: ఎక్కచెరువుతండాలో సాగు చేసిన బొబ్బెర

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరిగా చేసుకోవాలి

శంషాబాద్ రూరల్: భూమి ఉన్న రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్వేత శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దీని ద్వారా రైతులకు భూ ఆధార్ నంబర్ కేటాయిస్తారని పేర్కొన్నారు. మల్కారం, హమీదుల్లానగర్ క్లస్టర్ల వారీగా ఆయా రైతు వేదికల వద్ద రైతులు వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి ఆధార్ కార్డుతో పాటు దానికి లింక్ చేసిన మొబైల్ నంబర్ ఇవ్వాలని సూచించారు.